కేరింత

తవ్వా ఓబుల్ రెడ్డి

బడికి సమయం మించిపోతుండడంతో ఆతృతతో బస్సు దిగి వడిగా అడుగులేస్తున్న నాకు, 'ఆకాశవాణి' లాగా పరిచయమైన గొంతు ఒకటి వినబడింది. టక్కున నిలబడి దిక్కుల వైపు చూశాను. ఆ గొంతు వినబడుతూనే ఉంది. నా తల పైన ఉన్న చింత చెట్టు నుండి రెండు పండిన చింతకాయలు నా కాళ్ల ముందర తపాన పడినాయి. తలెత్తి చింతచెట్టు కొమ్మల్లోకి పరిశీలనగా చూస్తోంటే పై నుంచి పకపకా నవ్వు వినపడింది. ఆ నవ్వు ఎవరిదో టక్కున ఊహించుకున్నాను.

''ఒరే రామిరెడ్డీ...రెండు రోజుల నుండీ బడికి రాలేదేమిరా?'' అంటూ ప్రశ్నించాను. చెట్టు కొమ్మల్లోనుండీ మరో ఇద్దరి నవ్వు కిసక్కున వినబడింది. ఆ నవ్వులు రామిరెడ్డి సావాసగాళ్లైన బాల పుల్లయ్య, వెంకటేశు గాళ్లవేనని అర్థం అయింది.

నేను నిలబడేసరికి, చిటారు కొమ్మన ఉన్న రామిరెడ్డి కోతిలాగా రెండు అంగల్లో చెట్టు మొదల్లోకి వచ్చి అక్కడే ఆగిపోయినాడు. వాడి చొక్కా నిక్కరు జేబులు, కప్పను తిన్న పాములా ఉబికి ఉన్నాయి. జేబుల బొరల్లోనుంచీ చింతకాయలు బయటికి నిక్కబొడుచుకుని వచ్చాయి. కిందికి దిగి నా దగ్గరికి రావడానికి సంశయిస్తూ వాడు చెట్టు మొదల్లోనుండే ఇగిలిస్తూ నమస్కారం పెట్టినాడు.

''బడికెందుకు రాలేదురా'' మళ్లీ గద్దిస్తూ అడిగాను. నా గద్దింపంతా నటనే అని అనుకున్నాడేమో గాని, మళ్లీ కిసక్కున నవ్వినాడు.

''సార్ నేను బడికి రాను సార్..! బర్రెగొడ్లకు పోతాండ సార్.'' ఎలాంటి భయం లేకుండా చెప్పినాడు రామిరెడ్డి. వాస్తవానికి వాడి పేరు అది కాదు. అసలు పేరు ఈశ్వరయ్య. బలంగా బొద్దుగా ఉన్న ఈశ్వరయ్య సినిమా విలన్ రామిరెడ్డిలా డైలా



గులు చెబుతోంటే ఇళ్ళల్లో వాళ్లు వాడికి రామిరెడ్డి అని పేరు పెట్టినారు. స్కూలు రిజిస్టరులో ''ఈశ్వ రయ్య'' అనే ఉన్నప్పటికీ ఎందుకో నాకు కూడా 'రామిరెడ్డి' అని పిలవడమే సరదా! బడికొచ్చే పిల్ల లందరూ కూడా వాడ్ని అలాగే పిలుస్తారు.

రెండు రోజులుగా బడికి రాకపోయేటప్పటికీ రామిరెడ్డిపై నాకేమాత్రం కోపం రాలేదు. పైగా తాను ఎందుకు బడికి రాలేకపోతున్నాడో భయం లేకుండా చెప్పడం నాకు నచ్చింది. చెట్టు మొదల్లో అలాగే నిలబడి ఉన్నవాడు ఒక జేబులోంచి చింత కాయలు తీసి నా వైపునకు విసిరాడు. చింతకా యలు కింద పడకుండా పట్టుకోడానికి నేను కొంత ఇబ్బంది పడినప్పటికీ, అతి కష్టం మీద పట్టుకోగలి గాను.

''సార్...! చింతకాయలు తింటా బడికి పో...సార్..! బలే తియ్యంగ ఉండయ్...సార్...!'' అంటూ ఏదో కూనిరాగం తీస్తూ చిటారు కొమ్మకు ఎగబాకుతూ పోయినాడు వాడు. చింతపండు ఒక పిచ్చ ఒలుకుచుని చప్పరిస్తూ బడి వైపు అడుగులు వేస్తున్న నాకు రామిరెడ్డిని గురించిన ఆలోచనలే వస్తున్నాయి.

నాలుగో తరగతి చదువుతున్న రామిరెడ్డి చాలా హుషారైన వాడు. సాయంత్రం బడి చివరి గంటలో ఏ రోజైనా పాటలు పాడిస్తే రామిరెడ్డి జోరు చెప్పన లివి కాదు. ఒక పక్క పల్లె పాటలు పాడతాడు. కొత్త సినిమాల పాటలకు డాన్సులు అదరగొడ్తాడు. పాఠం చెప్పిన తర్వాత తరగతిలో అందరి కంటే ముందుగా రామిరెడ్డే టక్కున జవాబులు చెబు తాడు. అంత తెలివైన పిల్లోడు బాగా బడికి రాలేక పోతున్నాడనే బాధ అప్పుడప్పుడు నన్ను వేధిస్తూ ఉంటుంది. బడికి ఎందుకు రాలేదని గట్టిగా ప్రశ్నిస్తే ''మీకు శెలవులు ఉన్నెట్లే మాకూ ఉండాల సార్..!'' అంటూ ఫక్కున నవ్వుతాడు. ఆ నవ్వు లోని స్వచ్ఛత, వాడి ఆలోచనల్లో సూటిగా ప్రశ్నించే తత్వమే- వాడి పట్ల నాలో ప్రేమ, సాను భూతి కలగడానికి కారణాలేమో! వాణ్ణి బెత్తం ఎత్తి ప్రశ్నించడానికి కూడా నాకు మనసు ఒప్పదు. అయినా కోపం నటిస్తూ ఉంటాను.

''ఏంది సార్ వానితో గోము పడతాండవ్...! ఈత మెల్లె తీసుకోని వట్టికాళ్లకేసి నాలుగు పెరు కులు పెరుకు సార్..!'' అంటూ బడి దగ్గరికి వచ్చి అనేవాళ్లు కూడా లేకపోలేదు. రామిరెడ్డిని ఏ విధంగా బడికి రప్పించుకోవాలనే ఆలోచన నన్ను తొలుస్తూనే ఉంది.

చదువుల పండగ వచ్చింది. పదిరోజులపాటు నిజంగా పిల్లలకు పండగే! రంగు కాగితాలతో, మామిడి, కొబ్బరి ఆకులతో పిల్లలే బడిని అలంక రించారు ఉత్సాహంగా! చదువుల పండగకు లౌడ్ స్పీకర్‌ను ఏర్పాటు చేసుకున్నాం.

గాలిపటాలను తయారుచేసుకున్నాం. ఊళ్లో ఊరేగింపు జరిపినాం! పిల్లలంతా కాగితాల టోపీ ధరించి, సాక్షరతా నినాదాలతో, పాటలతో హోరె త్తించారు. చాలా రోజులుగా బడికి రాని రామిరెడ్డి ఎప్పుడు వచ్చినాడో ఊరేగింపులో కలిసి పోయి ఉన్నాడు. మైకు తీసుకుని పాట అందుకున్నాడు. పాటకు తగినట్టుగా అభినయం కూడా చేస్తు న్నాడు. చదువుల పండగ సందర్భంగా జరిగిన ఆటల పాటల పోటీల్లో క్రమం తప్పకుండా రామి రెడ్డి పాల్గొంటున్నాడు. బడికి రమ్మంటే బర్రెలకు పోతానని మొరాయించే రామిరెడ్డేనా వీడు? అనే అనుమానం కలిగింది.

చదువుల పండగ అయిపోయింది. బడిలో పిల్లల సంఖ్య కొంత పెరిగింది. రాంరెడ్డి మాత్రం రెండు రోజులు వచ్చి ఆ తర్వాత కనిపించలేదు. వాడు వంక మడుగుల్లో ఈతాడుతూ కనిపించా డనీ, బొంగరం తయారు చేసుకునేందుకు ఒంటి బోడు ఎక్కి కొయ్య కొట్టుకువచ్చాడనీ, కొండ కట్టెల్లో తేనె తట్టు రాల్చినాడనీ, రామిరెడ్డి ఆచూకీని గురించిన కథలను పిల్లలు రోజూ పొద్దున్నే చెబుతు న్నారు. రామిరెడ్డిని బడికి రప్పించడానికి ఏం చేయాలో నాకు ఏమాత్రం అర్థం కాలేదు. రామిరెడ్డి తల్లి దండ్రులను కలిసి మాట్లాడితే బాగుంటుంద నుకున్నాను.

''వాడు వస్తే బంగారంగా తోలుకుని...పో.. సారూ...! మేము వద్దంటాండమా? వాడే పని సేచ్చాండడు... ఎప్పుడన్నా మాకు కూలి పనులు దొరికినప్పుడు అదో.. ఆ బర్రె గొడ్లకు పోతడు అంతే..! వాడు చదుకోని బాగుపడితే మాకు గూడా మేలే గదు సారూ...!'' అవేదనగా అన్నారు రామిరెడ్డి తల్లి దండ్రులు.

రామిరెడ్డి నాయన చర్మాలకు కర్ర వేసి, గిరాకీ ఉన్నెప్పుడు నాలుగు రూపాయలు సంపాదించు కుంటాడు. అమ్మ, అక్క కూలి పనులకు పోతారు. పెద్దన్న మేకలకు, రెండో అన్న బర్రె గొడ్లకు పోతారు. కూలిపనుల కసాల్లో మాత్రం ఇంట్లో అందరూ పనులకు పోతే, రామిరెడ్డి బర్రెగొడ్లకు పోతాడు. కూలి పనులు లేని రోజుల్లో రామిరెడ్డికి రెక్కలొస్తాయి. వంకలమ్మడీ, వాగులమ్మడీ, చెట్ల మ్మడీ, చేలమ్మడీ ఎక్కడ చూసినా రామిరెడ్డే. మరి కొందరు బడి దొంగలతో రామిరెడ్డి జత కడుతూ ఉంటాడు. వాళ్లు ముదుర్లు. నేను కాలి బాట వెంబడి బడికి పోతున్నప్పుడు ఏ కంప చెట్ల మాటునో తచ్చాడుతూ ఉండి, నన్ను చూసి ఉరు కుతూ ఉంటారు. ఈ సావాసగాళ్లలో లచ్చు మయ్య, పోలయ్య ముఖ్యులు. రామిరెడ్డిని బడికి రప్పించుకోవాలంటే లచ్చుమయ్యను పోలయ్యను రామిరెడ్డి వెంట పోకుండా తప్పించాలని ఆలో చించాను.

లచ్చుమయ్య, పోలయ్యల ఇళ్లకు వెళ్లి, వాళ్లను బడికి పంపించాలని, చదువుకుంటే వాళ్ల భవిష్యత్తు బాగుంటుందని తల్లి దండ్రులకు చెప్పినాను. తమ పిల్లలు కొరగాకుండాపోతున్నారని వాళ్లు కూడా చాలా బాధ పడినారు.

''నీకెందుకు సార్..నాయాళ్లను గుదికాళ్లు కట్టు కొచ్చి బళ్లో ఏచ్చం. కొడ్తవో...తిడ్తవో...నీ ఇష్టం. పిల్ల నాకొడుకులు బాగు పడితే పదికాలాల పాటు నీ పేరు చెప్పుకుంటం'' లచ్చుమయ్య పోలయ్యల పెద్దోళ్లు ఇద్దరూ కూడబలుకున్నట్టుగా ఒకే మాట చెప్పినారు.

వాళ్లు చెప్పినట్లుగానే మరుసటి రోజు నుండే లచ్చుమయ్య, పోలయ్యలను బళ్లో వేసినారు. అంటే ఇంటికాడ భయం, ఇటు నా భయం కార ణంగా వాళ్లిద్దరూ బడికి రాక తప్పలేదు.

రామిరెడ్డి ఇప్పుడు ఏకాకి అయినాడు. సావాస గాళ్లు లేక దిక్కుతోచక వాడు కూడా బడికి వచ్చి తీరుతాడని అనుకున్నాను. అయితే వాడికి లచ్చు మయ్య, పోలయ్యల మాదిరిగా ఇంట్లో పెద్దోళ్ల భయం లేదు. అందువల్లే గాలి తిరుగుళ్లు బాగా అలవాటయ్యాయి.

రెండు రోజులు గడిచింది. రామిరెడ్డి ఆచూకీ గురించి పిల్లలను ఆరా తీసినాను.



''సార్! రామిరెడ్డి ఒంటిబోడు కాడ కుందేలు దొరికిందని ఇంటికి తెచ్చుకున్నె డు.. సార్... ఎప్పుడు చూసినా ఆ కుందేలు పిల్లతోనే ఆడుకుంటాంటడు సార్!'' నాలుగో తరగతి ఎల్లయ్య ఉప్పందించినాడు.

''సార్ రామిరెడ్డి కాడ నెమిలి గుడ్లు ఉండయ్ సార్? వాళ్ల నాయన ఎంటమ్మడి కొండకు కట్టెలకు పోయి తెచ్చుకున్నెడు... సార్...! వాళ్లింట్లో కోడిపెట్ట కింద ఆ గుడ్లను పెట్టినాడు సార్..'' మూడవ తరగతిలోని అశోక్ కళ్లు పెద్దవి చేసుకుంటూ మరింత సమాచారాన్ని అందించినాడు.

రామిరెడ్డి వైఖరి గురించి వాడి మనస్తత్వం గురించి ఆలోచిస్తూ గతంలో వాడి ప్రవర్తనను గుర్తు చేసుకున్నాను నేను. పాఠాలు వల్లె వేయడం, అడిగిన ప్రశ్నలకు జవాబులు అప్పచెప్పడం, కాపీ రైటింగులూ, డిక్టేషన్లు రాయడం పిల్లలు రోజూ చేస్తున్న పనే. బడికి రావాలంటే భయపడే పిల్లలు, రెండు మూడు రోజులు శెలవులు వస్తే ఒకటే కేరింతలు. ఆటలు ఆడించినా, పాటలు పాడించినా తమను తాము మరిచిపోయి, ఇట్టే కలిసిపోయి గెంతులు వేసే మనస్తత్వం వారిది. ఈ అంశాలకు రామిరెడ్డి ప్రవర్తనకి సంబంధం ఉండి ఉంటుందని అనిపించింది నాకు. దీపావళి పండుగ వచ్చింది. పండగకు వరుసగా రెండు రోజులు శెలవులు రావడంతో పిల్లల సంతోషానికి అవధుల్లేవు. పండుగ అయిపోగానే యూనిట్ పరీక్షలుంటాయని చెప్పగానే ఆ సంతోషం టక్కున మాయమైపోయింది. చదువుల పండుగలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలిచిన వారికి బహుమతులను పండుగ తర్వాత ఇస్తానని చెప్పగానే పిల్లలు మళ్లీ కేరింతలు పెట్టినారు.

దీపావళి పండుగ గడిచిపోయింది. పిల్లకిచ్చేందుకు బహుమతులను తీసుకెళ్లినాను. ఆ రోజు పిల్లలందరూ హాజరైనారు. రామిరెడ్డి వెనుక వరుసలో గోడకు ఆనుకుని కూర్చుని ఉండడం నాకు ఆశ్చర్యం కలిగించింది. బహుమతులు ఇస్తున్నందు వల్లే రామిరెడ్డి ఈ రోజు బడికి వచ్చి ఉంటాడని అనుకున్నాన్నేను. బహుమతులను పంచేందుకు సన్నద్ధం అవుతుండగా బడిలో పిల్లల్లో కలకలం బయలుదేరింది. ఆందరూ కేకలు వేస్తూ ఎగురుతున్నారు.

''కుందేలు...కుందేలు...!'' అని పెద్దగా అరుస్తున్నారు వాళ్లు.

''సార్! రామిరెడ్డి వళ్లో తెల్లటి కుందేలు పిల్ల ఉంది. చెవులు నిక్కబొడుచుకుని లేత కళ్లతో బిక్కు బిక్కుమంటూ చూస్తూ కొంత దూరం గెంతిందది. కుందేలు పిల్లను పిలుస్తున్నట్టుగా రామిరెడ్డి ఏదో శబ్దం చేసినాడు. అది ఎగురుకుంటూ వచ్చి రామిరెడ్డి వళ్లో కూర్చుంది.

స్నేహితులను దూరం చేస్తే రామిరెడ్డి బడికి వస్తాడని, భావించి నేను పొరబడినానని అప్పుడు స్పష్టం అయింది.

ప్రకృతి, పరిసరాలు, చెట్లు, చేమలూ, మూగజీవాలూ మనిషి జీవనశైలిని ప్రభావితం చేస్తాయని, నాలుగు గోడలే లోకం కాదని అందుకు రామిరెడ్డే ఒక మంచి ఉదాహరణ అని అర్థం అయింది నాకు. పిల్లలకోసం తెచ్చిన బహుమతులను సంచిలో నుండీ బయటికి తీశాను. రామిరెడ్డిని ముందుగా పిలిచి ఒక మంచి పెన్నును బహుమతిగా అందచేశాను. పిల్లల చప్పట్లతో బడి మార్మోగిపోయింది.

ఇది ఆటలపోటీ బహుమతి కాదనీ, కుందేలు పిల్లలతో స్నేహం చేస్తున్నందుకనీ, రామిరెడ్డిని అభినందిస్తూ చెప్పినాను. వాడి కళ్లల్లో ఆనందం, కృతజ్ఞత వ్యక్తమైంది.

''ఈ పొద్దునుంచీ కుందేలు కూడా రోజూ బడికి వచ్చది సార్...!'' చంకలో పెట్టుకున్న కుందేలును నిమురుతూ నవ్వినాడు రామిరెడ్డి.

★

ఈ బుల్లితెర ముద్దుగుమ్మ పేరు నౌషీన్. కుసుమ్ సీరియల్‌తో ఈమెకి పెద్ద పేరొచ్చిపడింది. పదహారేళ్ల వయసులో మోడలింగ్‌లోకి ప్రవేశించింది. ఇప్పుడు ఆమె వయసు 24. ఈ ఎనిమిదేళ్లలో మోడలింగ్ నుంచి, ఫ్యాషన్ షోలు, వీడియో ఆల్బమ్స్, యాడ్స్‌లో తలమునకలై టీవీ సీరియల్స్ వరకూ వచ్చింది. ఇప్పుడు చూపంతా బాలీవుడ్ పై పడింది. ''సినిమాల్లో ఒక్కసారిగా అవకాశాలు వచ్చిపడ్డానికి నాకేం గాడ్ ఫాదర్స్‌లేరు. నేను మిస్ ఇండియానూ కాను. చాలా సాధారణమైన, సనాతనమైన ఫామిలీ బాక్ గ్రౌండ్ నాది. కష్టపడి ఈ స్టేజీకొచ్చాను. బి గ్రేడ్ సినిమాల్లో నటించి ఒళ్లంతా చూపించడం నాకిష్టంలేదు. టీవీల్లో కూడా ఏదిపడితే ఆ పాత్రల్ని ఒప్పుకోవడం లేదు. ఈ మధ్య తల్లివేషానికి ఆఫరొచ్చింది. పాతికేళ్ల వయసు కూడాలేని నేను తల్లిలా నటించడమా? నాన్సెన్స్'' అంటోంది నౌషీన్.